

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

పాఠశాలలను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆత్రేయపురం, మెర్లపాలెం ప్రభుత్వ పాఠశాలలను ఎంపిడిఒ బికెఎస్ఎస్. వెంకటరామన్, ఎంఇఒ వర ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. ఆత్రేయపురం నరసన్నపేటలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాల రేకుల షెడ్డు కావడంతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరామన్

తోటపేటలో అటకెక్కిన పారిశుధ్యం

- విధులు బహిష్కరించిన కార్మికులు
- వెలగని వీధిలైట్లు, పేరుకుపోతున్న చెత్త
- వేతనాలు ఇవ్వకుండా అడ్డుకంటున్న పెత్తందారు



తోటపేటలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేటలో పది రోజులుగా పారిశుధ్యం అటకెక్కింది. పంచాయతీ పారిశుధ్య కార్మికులు వారం రోజులుగా విధులను బహిష్కరించారు. దీంతో వీధులు, రోడ్ల వెంబడి చెత్త చెదారం పెరిగిపోతుంది. పూడిక తీయకపోవడంతో డ్రెయినేజీలు దుర్వాసనను వెదజల్లుతున్నాయి. వారం రోజులుగా వీధి దీపాలు సైతం వెలగడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామంలో చెత్తను సేకరిస్తున్న ఐదుగురు పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.6 వేలు చొప్పున 3 నెలల జీతాన్ని ఇటీవల చెల్లించారు. తిరిగి వెనక్కి తీసేసుకున్నారు. దీంతో కార్మికులు విధులను బహిష్కరించారు. దీని వెనుక గ్రామంలోకి ఒక పెత్తం దారు హస్తం ఉందని గ్రామస్తులే చెబుతున్నారు. ఆయన ఆదేశాలతోనే ఇచ్చిన వేతనాన్ని వెనక్కి తీసేసుకున్నారని చెబుతున్నారు.

పురుషోత్తం చెప్పడం వల్లే జీతాలు వెనక్కి

పారిశుధ్యం, జీతాల విషయమై గ్రామ కార్యదర్శి మణికంఠను వివరణ కోరాగా... పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.6వేలు చొప్పున జీతం ఇస్తున్నామని, పంచాయతీ నుంచి మరో రూ.1,500 అదనంగా చెల్లిస్తున్నామని తెలిపారు. మూడు నెలలు పాటు జీతాలు ఇచ్చామని అయితే గ్రామానికి చెందిన దామిశెట్టి పురుషోత్తం పెత్తనం చాలాయిస్తూ జీతా లు వెనక్కి తీసుకు రమ్మన్నారని తెలిపారు. దీంతో పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన జీతాలు వెనక్కి తీసుకోవడంతో వారంతా విధులను బహిష్కరిం చారన్నారు. ఈ విషయాన్ని ఎంపిఇఒ పద్మజ్యోతికి, ఇఒపిఆర్‌డి సెలెక్ట్‌రాజుకు వివరించానని తెలిపారు.



చెత్తను డంపింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు(ఫైల్ ఫొటో)

ఎవరీ పురుషోత్తం..?

గ్రామానికి చెందిన దామిశెట్టి పురుషోత్తం బడా భూస్వామి, పెత్తందారు. గ్రామంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తన చెప్పుచేతల్లో ఉన్న మనుషులను బరిలో పెట్టి పార్టీలకతీతంగా నెగ్గించుకోవడం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య. గ్రామంలో ఎవరు గెలిచినా పెత్తనం అంతా ఆయన చేతుల్లోనే ఉంటుంది. పంచాయతీ కార్యకలాపాల నుంచి సిబ్బంది వేతనాల వరకూ ఆయన చెప్పినట్టే జరగాలి. పంచాయతీలో ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా ఆయన ఆశీస్సులు ఉండాల్సిందే. ఆయన నిర్ణయిం చిన చోటే పనులు ప్రారంభం అవుతాయి. గతంలో ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులతో ఆయన పొలానికి, దూడల పాక వద్దకు రెండు రోడ్లను వేయించుకున్న ఘనుడు ఆయన. పాలక పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధుల అండదండలతో గ్రామంలో ఏకచక్రాధిప త్యం చెలాయిస్తుంటాడని గ్రామస్తులే చెబుతున్నారు.

జీతం లేకుండా ఎలా బతకాలి

నాలుగు నెలలుగా వేతనాలు లేవు. బ్యాంకుకు వెళ్లి వేతనాలు మూడు నెలల వేతనాలు తెచ్చుకున్నాము. ఆ డబ్బును వెనక్కి ఇచ్చేయాలని చెప్పడంతో ఇచ్చేశామ. పెత్తందారు వల్లే ఈ కష్టాలు వచ్చాయి. దీనిపై అడిగితే పంచాయతీ కార్యదర్శి నుంచి గాని, సర్పంచ్ నుంచి గానీ జవాబు లేదు. కావాలంటే తన డబ్బులు ఇస్తానని, వేతనాలు మాత్రం ఇవ్వలేమని పెత్తందారు చెబుతున్నాడు. ఒక రకంగా ఆయన అప్పు ఇస్తామని చెబుతున్నాడు. ఇది ఎంతవరకూ సమంజసం.

- పారిశుధ్య కార్మికుడు, తోటపేట

ఎంపిడిఒతో చర్చించి చర్యలు తీసుకుంటాం...

తోటపేట పంచాయతీలో నెలకొన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శి నా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపిడిఒతో చర్చించి చర్యలు తీసుకుంటాం. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటా.

- సెలెక్ట్ రాజు, ఇఒపిఆర్‌డి



సిఐటియు విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, నరసింగరావు

ప్రజాశక్తి - అమలాపురం

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పోరాటాలతోనే సాధ్యమని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, నరసింగరావు అన్నారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ హోంలో సిఐటియు విస్తృత సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో కార్మికుల ఎదురుకుంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ స్కూల్ నైట్ వాచ్‌మెన్‌లకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, సిఐటియు ఆధ్వర్యంలో డిఇఒకి వినతిపత్రం అందించినా అధికారుల్లో చలనం లేదని పలువురు నాయకత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం కలిగించేలా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొస్తు న్నాయని అన్నారు. జూలై 9న నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా పెద్దఎత్తిన కార్మికవర్గం వ్యతిరేకించిందని అన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడంలో సిఐటియు ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్మిక కర్షక ఐక్యతతో పెట్టుబడిదారి విధానాన్ని కూల్చి కార్మికులకు రాజ్యాధికారం స్థాపించడం సిఐటియు లక్ష్యమని అన్నారు. ఈ ఆశయ సాధన ద్వారానే కార్మిక వర్గం నేడు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తుందని, సోషలిజం ఒక్కటే నేటి సమస్యలకు సరైన మార్గమని అన్నారు. పాఠశాలల నైట్ వాచ్‌మెన్‌లకు గత ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా జీవిస్తాయని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వారందరికీ బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వెల్‌ఫేర్ బోర్డు యథావిధిగా కొనసాగిస్తామని కూటమి పార్టీల నేతలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా నేటికీ ఆ హామీని అమలు చేయక పోవడం దారుణమన్నారు. దీనికోసం సెప్టెంబర్ 15 ఛలో విజయవాడ పిలుపు ఇచ్చామని తెలిపారు. సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతాయని వివరించారు. ఈ మహాసభలో కార్మిక, కర్షక, రైతు సమస్యలపై చర్చించి భవిష్యత్ నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులు భాస్కరరావు, బండి వెంకటలక్ష్మి, కార్యదర్శి మలక సుభాషిణి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్తేరురాణి, దైవకృప, ఈశ్వరి, రాంబాబు, విప్పర్తి మోహన్‌రావు, పిండి కాళిదాసు, వర్మ, రమణ, మట్టా ప్రసాద్, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొత్తపేట, ఆలమూరు

కొత్తపేట మండలంలోని మోడేకుర్రు గ్రామం పరిధిలో రూ.1.45 కోట్ల నాబార్డు నిధుల తో రహదారి నిర్మాణానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. సోమ వారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ రహదారులు, మౌలిక సదుపా యాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయల తో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూడుపూడి రామలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, ఎంపిటిసి సభ్యులు రెడ్డి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ బొక్క కుమార్, నాయకులు కుడుపూడి వెంకటేశ్వ రరావు, సరేల రాజబాబు, నాగిరెడ్డి వెంకటరత్నం, గొల్లకోటి సత్తిబాబు, పాల్గొన్నారు. అలాగే ఆలమూరు మండలంలో మడికి రావిచెట్టు నుంచి చిలకలపాడు శివారు వరకు రూ.1.14 కోట్ల నాబార్డు నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిలకలపాడు గ్రామానికి చెందిన పలు సమస్య లను గ్రామస్తులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.రాజు, సర్పంచ్ ఉంగ్రాజపు లక్ష్మిమౌనిక, ఎఎంసి ఛైర్‌పర్సన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, సొసైటీ ఛైర్మన్ వంటిపల్లి సతీష్, నాయకులు ఉంగ్రాజపు చిన్న, ఈదల నల్లబాబు, నాగిరెడ్డి వెంకటరత్నం, దొండపాటి సుబ్బరాజు, ఈదర రమేష్, పంపన అంజిబాబు పాల్గొన్నారు.



కొత్తపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

విలీనం కోరుతూ ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజక వర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలంటూ సోమవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. సోమ వారం స్థానిక రాజగోపాల్ సెంటర్ నుంచి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వరకూ ప్రదర్శన సాగింది. అనంతరం ధర్నా జరిగింది. కాకినాడ జిల్లాలో విలీనం కోసం నాయకులు డిమాండ్ చేశారు. అమలా పురం జిల్లా కేంద్రం రామచంద్రపురానికి దాదాపు 60 కి.మీ. దూరంలో ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని అన్నారు. వరదలు, తుపానులు వంటి విపత్తుల సమయంలో గోదావరి నది పొంగిపోవడం, రహదారులు మునిగి పోవడం, రవాణా ఆగిపోవడం వలన ప్రజలు అత్యవసర అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. కాకినాడ జిల్లా కేంద్రం కేవలం 25 కిలోమీటర్లకు మించి లేదని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆధునిక వైద్య సదు పాయాలు, విశ్వవిద్యాలయం, కళాశా లలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం ఆమోదించి రామచంద్రపురం నియోజక వర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ అఖిలప్రియకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంపిపి అంబటి భవానికి వినతిపత్రం అందించారు. మండల పరిషత్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి.సిద్ధూ, గౌరవ అధ్యక్షులు గరికిపాటి సూర్యనారాయణ, ఉండవిల్లి గోపాల్‌రావు, గాధంశెట్టి శ్రీధర్, గొల్లపల్లి కృష్ణ, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు ఎం.వేంకటేశ్వరరావు, విఆర్‌ఒల సంఘం అధ్యక్షులు మద్దాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ అఖిలప్రియకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

విలీనం కోరుతూ మండల పరిషత్ తీర్మానం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని మండల ప్రజా పరిషత్ పాలకవర్గం తీర్మానించింది. సోమవారం మండల పరిషత్ పాలకవర్గం ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో రామచంద్రపురం నియోజక వర్గాన్ని విలీనం చేయాలని తీర్మానించినట్లు ఎంపిపి భవాని తెలిపారు. మండల పరిషత్ తీర్మాన పత్రాన్ని ఆర్‌డిఒ అఖిలప్రియ, తహశీల్దార్ మృత్యుంజయ రావుకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపిపి భవాని

వరి పంట సంరక్షణ చర్యలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వర్షాలతో నీట మునిగిన పంటను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటే పంటను కాపాడుకోవచ్చునని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలలో వరి పంట ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో నీట ముంపునకు గురైందన్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటియు 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటియు 1061, ఎంపియు 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయని అన్నారు. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగిన మొక్కలు చనిపోయిన ఎడల మనేదలు వేసుకోవాలన్నారు. నారుమడి లేదా ఎద పద్ధతిలో విత్తిన పొలం నీట మునిగితే నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే మూడు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగా మడిలో నుంచి నీరు బయటకు తీసి వేసి పొలం ఆరబెట్టాలని అన్నారు. అనంతరం 5 సెంట్ల నారుమడికి 1.0 కిలోల యూరియా 1.0 కిలో పొటాష్ వేయాలన్నారు.

పడవ ప్రయాణాలు నిలుపుదల

ప్రజాశక్తి - మామిడికుదురు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఈదురుగాలులు వీయడంతో మండల పరిధిలోని గోగనమఠం, కరవాక ప్రధాన రేవుల్లో బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. సోమవారం అధికారుల ఆదేశాలతో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ అడబాల శ్రీనివాసరావు ఆయా రేవులను పరిశీలించి స్థానికులతో చర్చించి, అక్కడ పరిస్థితులు సమీక్షించి, బోటు రాకపోకలు నిలిపివేయించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ప్రయాణాలు రాకపోకల నిలుపుదల కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిఎస్‌విఎస్.ప్రసాద్, అల్లు సురేష్, విఆర్‌ఒ పాల్గొన్నారు



గోగన మఠం రేవును పరిశీలిస్తున్న అధికారులు

పోరాటయోధుడు పాపన్న గౌడ్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

సామాన్యుల కోసం పోరాడిన యోధుడు, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా తలెత్తిన తొలి బహుజన వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ అని మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.

ఆశా వర్కర్ల నియామకం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పిహెచ్‌సి పరిధిలో ఆశ వర్కర్లను నియమించినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎల్.నాగార్జున సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఉప్పలగుప్తం-1, గొల్లవిల్లి ఆశ వర్కర్ల పోస్టులకు కాసిన శివగౌరీ, బత్తుల భాగ్యలక్ష్మిలను నియమిస్తూ డిఎంహెచ్ఒ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం ఏలూరు జిల్లా భైరవపట్నంకు చెందిన గాదిరాజు నారాయణరాజు, అరుణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా పటమటకు చెందిన కటకం నాగవెంకట అంజనీశివ శ్రీలాస్య, వారి కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర్‌రావుకు అందజేశారు. దాతలకు తీర్థ ప్రసాదాలతో పాటు, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.


వర్షాలతో రహదారులు ఛిద్రం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారు తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని సన్నవిల్లి-ఉప్పూడి, ఉప్పలగుప్తం-పేరాయిచెరువు, ఉప్పలగుప్తం-పెదగాడవిల్లి రహదారులు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో రహదారులను పట్టించుకోలేదని, ప్రస్తుత పాలకులైనా రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న రహదారి



సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదలైన 22 మందికి బాధిత కుటుంబాలకు రూ.15,69,229 విలువ చేసే చెక్కులను కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుంద న్నారు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలు, ఎన్‌టిఆర్ వైద్య సేవ పరిధిలో లేని చికిత్సలు అవసరమైన వారికి ప్రజా ప్రతినిధుల సిఫార్సుతో ఈ సాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వుండవిల్లి శివ, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న మంత్రి సుభాష్

20న మాల కార్పొరేషన్ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి - అమలాపురం

మాల కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పెదపాటి విజయ్‌కుమార్ ఈ నెల 20న కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారని ఎస్‌సి కార్పొరేషన్ సంచాల కులు జె.సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న స్థానిక పంచాయతీ రాజ్ గృహానికి చేరుకుని ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్‌సి ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌తో భేటీ అవుతారని వివరించారు. మధ్యాహ్నం నుంచి అంబాజీపేట షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడతారని వివరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సొసైటీ ఛైర్మన్ సత్యవెంకటరాయపరాజు

త్రీమెన్ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఐ.పోలవరం పిఎసిఎస్ త్రీ మెన్ కమిటీ ఛైర్మన్‌గా కాకర్లపూడి సత్య వెంకట రాయపరాజు, డైరెక్టర్లుగా మద్దిరెడ్డి కుమార్, చోడిశెట్టి వీరబాబు ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రత్యేక అధికారి టి.ఫణిపెత్రరాజు ఆధ్వర్యంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి సమక్షంలో వారు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, నాయకులు సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, అశోక్, చిలువూరి సుబ్బరాజు, గుత్తుల సాయి, చిక్కాల శ్రీనివాస్, పెంటా రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గ్రామంలోని పెదమడి సత్తెమ్మ తల్లి గుడి నుంచి టి.కొత్తపల్లి రహదారి వరకూ రూ.2.2 కోట్లుతో నిర్మించిన సిసి రోడ్లను, బాణాపురంలో రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని నాయకులు ప్రారంభించారు.

నేరాలు ఘోరాలు


అదుపు తప్పిన ఒఎన్‌జిసి ఆయిల్ ట్యాంకర్

అదుపు తప్పిన ఆయిల్ ట్యాంకర్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం
ఎస్.యానం ఒఎన్‌జిసి ఆన్ లోడింగ్ పాయింట్‌కు వెళుతున్న ఒఎన్‌జిసి ఆయిల్ ట్యాంకర్ సోమవారం ఖబ్బిరాలి పేట వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి జారింది. దీంతో రహదారిపై రోడ్డుకు అడ్డంగా ఆయిల్ ట్యాంకర్ నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ట్యాంకర్ నిండా క్రూడ్ ఆయిల్, గ్యాస్ ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - ఆలమూరు
మండలంలోని చొప్పెల్ల శివారు పంట పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చొప్పెల్ల శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై ఏపి గేమింగ్ యాక్ట్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

నకిలీ కరెన్సీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

ప్రజాశక్తి -కొవ్వూరు
నకిలీ కరెన్సీ తయారీ కేసులో ముగ్గురు వ్యక్తులకు కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి జివిఎల్.సరస్వతి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. నకిలీ కరెన్సీ తయారీపై 2013లో రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులైన ప.వంగిడికి చెందిన చదలవాడ అనిల్ కుమార్, నర్సీపట్నంకు చెందిన తమ్మిండ్ర రంజిత్ సింగ్, ఏలూరుకు చెందిన ఎల్లంపల్లి శ్రీనివాసరావులపై నేరం రుజువు కావడతో న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు కాగా ముగ్గురు గతంలో మృతి చెందారు. అప్పటి ఎస్ఐ అర్జునరాజు కేసు నమోదు చేయగా అనంతరం ఎస్ఐ ఎం.జయబాబు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

కొట్లాట ఘటనలో పలువురిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - గోపాలపురం
కొట్లాట ఘటనలో ఇరువురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక బిసి కాలనీలో కృష్ణాష్టమి వేడుకల అనంతరం ఓ గ్రూపునకు చెందిన యువకులకు సంబంధించి వాట్సాప్ గ్రూపులో వాయిస్ మెసేజ్ రూపంలో గొడవ జరిగింది. మెసేజ్‌లు పెట్టిన యువకుడిని అదే గ్రూపులోని కొందరు యువకులు టాక్సీ స్టాండ్ సమీపంలో ఉన్న చికెన్ షాప్‌లోకి తీసుకెళ్లి కొట్టారు. ఈ సమయంలో అదే షాపు ఎదురుగా మరొక షాపులో ఉన్న ఉప్పుగంటిదేవికి చెందిన ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో వారు వాగ్వాదానికిదిగారు. అక్కడున్నవారు ఆ సర్ది చెప్పడంతో వెళ్లిపోయారు. అనంతరం ఆదివారం సాయంత్రం ట్యాక్సీ స్టాండ్ సమీపంలో ఇరుగ్రూపుల ఘర్షణకు దిగాయి. ఈ ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వారిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీంతో ఇరు గ్రూపులు చెందినవారు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కొవ్వూరు రూరల్ సిఐ నాగేశ్వర్‌నాయక్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్, సిఐ నాగేశ్వర్‌నాయక్ బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసులు నమోదు చేశారు. అలాగే జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన కొంతమంది యువకులపైనా కేసులు నమోదు చేశామని తెలిపారు. ఆదివారం నుంచి గోపాలపురంలో 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు.

బైకు పైనుంచి పడి బాలునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గోపాలపురం
ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడడంతో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కొమంటికుంట గ్రామానికి చెందిన దాసరి ధనుష్, దాసరి దయ అన్నదమ్ములు. హెయిర్ కటింగ్ నిమిత్తం తన బాబాయ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వారు గోపాలపురం వెళ్లారు. గోపాలపురం దాటిన తరువాత వారి బైకు అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ధనుష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

అదనపు కట్నంపై కేసు

ప్రజాశక్తి - సీతానగరం
అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, అతని కుటుంబ సభ్యులు చిత్రహింసలకు పాల్పడుతున్నట్లు సీతానగరం మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన తోట్టపాటి సంధ్యారాణి సోమవారం సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సంధ్యారాణి భర్త అప్పలరాజు రాజకుమార్, అత్తమామలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

90 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం
మండలంలోని ఇనగంటివారిపేట ఏటుగట్టు వద్ద సారాను తరలిస్తుండగా విల్లి రాము అనే వ్యక్తిని అరెస్టు చేసి, మూడు సంచులలో 90 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుని కోర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అర్జీలకు నూరుశాతం పరిష్కారం

ప్రజాశక్తి - అమలాపురం
ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నూరు శాతం పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డిఆర్ఒ కె.మాధవిలతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. వచ్చిన అర్జీపై క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టరాదని, అర్జీలు రీఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి సరైన జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 135 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నాణ్యత కనబరచాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించిన సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ మధుసూదన్, డిఎస్ఒ ఎ.ఉదయభాస్కర్, ఎస్‌డిసి పి.కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం
జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న క్రమంలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని అన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కిలో ఎరువు కూడా పక్కదారి పట్టడానికి వీల్లేదన్నారు. సాగు అవసరాల మేరకే ఎరువులు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల లెక్కలకు సంబంధించి భౌతికంగా ఆన్‌లైన్ రికార్డులతో లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు. యూరియాతో పాటు, డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్‌పి కాంప్లెక్సు వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని, పల్లపు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల పాటు భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని, వరదలు, వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల సహాయక చర్యల నిమిత్తం కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ చేశామని, 08856బి 293104 నెంబర్ 24 గంటలు పని చేస్తుందన్నారు. అలాగే ఆర్‌డిఒ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన సూచించారు.

జిఒ నెంబర్ 30ని రద్దుచేయాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్
ప్రభుత్వ పాఠశాలల్లోకి రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు వెళ్లకూడదని ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెం.30ని తక్షణమే రద్దు చేయాలని వైసిపి విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ రమేష్ జిల్లెళ్ళ డిమాండ్ చేశారు. సోమవారం అమలాపురం రూరల్ ఎ.వేమవరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లేదని, రెడ్‌బుక్ పాలన, ఎల్లో బుక్ ఎడ్యుకేషన్ పాలసీ నడుస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు బయటకి వస్తాయన్న భయంతోనే ప్రభుత్వ పాఠశాల్లోకి ఎవ్వరూ వెళ్ళకూడదనే జిఒను విడుదల చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో జైలులో ఉన్న ఖైదీలను కలవడానికి వెసులుబాటు ఉన్నది గానీ చదువుకునే విద్యార్థులు కలవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. తక్షణమే జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు వింటి రాజా, కీర్తి రైనా, దేవరపల్లి గౌతమ్, ఉండ్రు వినోద్, గెల్ల శ్రీనాథ్, మరే రవితేజ, గెడ్డం రమేష్, బన్నీ, మధు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం
అనధికార లే అవుట్‌లలో ఇళ్లు నిర్మించుకున్న వారు ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ అధికారి బి.రాజేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో అనధికార లే అవుట్‌లలో, ప్లాట్లలో ఎటువంటి అనుమతులు పొందకుండ నిర్మించిన ఇళ్ళను క్రమ బద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌లో 90 రోజుల పాటు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ స్కీమ్ ద్వారా 30 జూన్ 2025కి ముందు ఎవరైనా అనధికార లే అవుట్‌లో ప్లాట్లు మరియు స్థలాలు కొనుగోలు చేస్తే ఎల్ఆర్ఎస్ వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకుని, పీనలైజేషన్ ఛార్జీలు, సంబంధిత స్థలానికి 14 శాతం వాల్యూ ప్రకారం ఛార్జీలు చెల్లించి, సంబంధిత స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. నగర పంచాయతీలో 16 అనధికార లే ఔట్ దారులను గుర్తించామని, వీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం
వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన ద్వారం వెడల్పు పనులను ఆయన ప్రారంభించారు. ఆలయ మాడవీధులలో ఏడు ప్రదర్శనలు చేసే యాత్రికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుసంపూడి రామకృష్ణరాజు, ముదునూరి వెంకటరాజు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - రామచంద్రపురం
మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో నిర్మించే రామాలయ నిర్మాణానికి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ సోమవారం శంకుస్థాపన చేశారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నిధుల నుంచి రామాలయం నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, మాజీ ఎపిఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్ ఎల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపిటిసి సభ్యులు కనితి వెంకటేశ్వరి, దడాల రవికుమార్, బాపనయ్య చెరువు సర్పంచ్ సూర్యప్రకాష్,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - మామిడికుదురు
మొగలికుదురు హైస్కూల్ ప్రాంగణంలో 1996- 97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థులు రూ.4.50 లక్షలు వ్యయంతో మండపంతోపాటు సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ కడి అరుణకుమారి, కాసిన లక్ష్మీపతి, హెచ్‌ఎం కొండా మల్లేశ్వరగాంధీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యానికి రూ.1.18 లక్షల సాయం

ప్రజాశక్తి - మామిడికుదురు
మండలలోని లక్కవరంకి చెందిన ఇంటర్ విద్యార్థి నైనాల జహ్నవిపుష్ప అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె వైద్యానికి రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆమె ఆమె వైద్యానికి మామిడికుదురుకు చెందిన వంగవీటి మోహనరంగా, రాధా మిత్రమండలి సభ్యులు రూ.1.18 లక్షలు సేకరించి విద్యార్థి తండ్రి సాంబమూర్తికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌ను దూషించిన ఎంఎల్ఎ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం
యంగ్ టైగర్ ఎన్‌టిఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించిన అనంతపురం ఎంఎల్ఎ దగ్గుపాటి ప్రసాద్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎన్‌టిఆర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు వాసంశెట్టి శ్రీనివాస్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్లో ఎంఎల్ఎపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - అమలాపురం
గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ కొత్త మాధవి ఆదేశించారు. సోమవారం స్థానిక భూపయ్య అగ్రహారం సాయి రవీంద్ర ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. ఆడ శిశువుల జననాల పట్ల వివక్షను అరికట్టే చర్యల్లో భాగంగా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై పరీక్షలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అన్ని స్కానింగ్ సెంటర్లలో కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని డేకాయ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం జరిమానాలు, శిక్షలు అమలు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ డిఎంహెచ్ఒ సిహెచ్‌వి. భరతలక్ష్మి, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న డిఆర్ఒ మాధవి

సఖినేటిపల్లి రేవులో ప్రయాణికుల రద్దీ

ప్రజాశక్తి - సఖినేటిపల్లి
సఖినేటిపల్లి - నరసాపురం మధ్య మాధవాయపాలెం ఫెర్రీ వద్ద వశిష్ట గోదావరి దాటే ప్రయాణికులతో రద్దీ పెరిగింది. గత 20 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ప్రయాణికులతో పాటు వాహన దారులు బారులు తీరారు. పశ్చిమ గోదావరి జిల్లా చించినాడ, దిండి మధ్య గల వారధికి మరమ్మతుల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులు వంతెనను పూర్తిగా నిలిపివేశారు. గత పది రోజులుగా హెవీ వెహికల్స్‌కు అనుమతి నిలిపివేసి లైట్ మోటార్ వెహికల్స్‌ని మాత్రమే అనుమతించారు. దీంతో వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం కావడంతో రద్దీ పెరిగింది. పంటు ప్రయాణం కొరకు కార్లు దాటేందుకు గంటల కొద్దీ వేచి చూడాల్సివస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.


పంటు దాటేందుకు బారులు తీరిన వాహనాలు

వైద్యాధికారిపై ఎంపిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అంబాజీపేట
మండలంలో ప్రోటోకాల్ పాటించడం లేదంటూ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.సుమప్రియపై ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ముక్కామల పిహెచ్‌సిలో జరిగిన జాతీయ పతాకావిష్కరణకు ఆసుపత్రి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న తనకు కనీస కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 12న నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా నులిపురుగు మాత్రలు పంపిణీ చేసిన సందర్భంలోనూ తమకు సమాచారం ఇవ్వలేదని, డిఎంహెచ్ఒకి ఫిర్యాదు చేసినా స్పందించలేదని కలెక్టర్‌కు వివరించారు. మండలంలో ప్రోటోకాల్ మాన్యువల్‌ను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మునిగిన పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - ముమ్మిడివరం
మండలంలో కురిసిన వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను ఏరువాక శాస్త్రవేత్తల బృందం సోమవారం పరిశీలించింది. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఏరువాక వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిషోర్ బృందం కొత్తలంక గ్రామంలో పర్యటించింది. పల్లపు ప్రాంతాల్లోని వరి సాగు రైతులు త్వరితగతిన నీటిని తొలగించి నాట్లు దెబ్బతినకుండా ఎకరానికి 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తెగుళ్ళు సోకకుండా కర్బెన్డిజమ్, మాంకోజెబ్‌ను లీటర్ నీటిలో 2.0 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ పి.రాధిక, డాక్టర్ ఎం.విరోనిక, ఎఒ మనోహర్, రైతులు పాల్గొన్నారు.


మునిగిన పొలాలలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దేవస్థానం పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - కొత్తపేట
మండలంలోని బిళ్ళకుర్రు గ్రామంలో ఉన్న మహాదేవ దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగింది. సోమవారం దేవస్థాన ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్‌గా నల్లం వెంకటశ్రీరామ్ మూర్తి, ధర్మకర్తలుగా చోడే హరినాథ్, డేగల మంగాదేవి, రుద్ర వెంకటలక్ష్మి, బిల్లకుర్తి నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యవతి, దంగేటి బాలరాజు, చావలి గోవిందాదీక్షితులు, కందికట్ల మంగాదేవి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి ధర్నాల రామకృష్ణ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ వీరేష్, ఎంపిటిసి సభ్యులు చిత్రపు ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న పాలకమండలి


కేక్ కట్ చేస్తున్న ఎపిపి సునీల్‌కుమార్

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు
మండల కేంద్రానికి చెందిన 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఎపిపి కప్పల సునీల్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం మండపేటలోని వికలాంగుల వసతి గృహంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల మధ్య జన్మదిన వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ నిర్వాహకులు, సునీల్ ఫాలోవర్స్ పాల్గొన్నారు.

కూలిన ఇల్లు..తప్పిన ప్రాణ నష్టం

ప్రజాశక్తి - రామచంద్రపురం
గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కె.గంగవరం మండలం కుడుపూరులో పల్లెటి వెంకటరావుకు చెందిన పెంకుటిల్లు ఆదివారం రాత్రి కుప్పకూలింది. వెంకట్రావుతో పాటు భార్య, పిల్లలు ఇదే ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి వర్షం అధికంగా ఉండటంతో పక్కంటికి వెళ్లి భోజనాలు చేస్తుండగా ఒక్కసారిగా ఆ ఇల్లు కుప్పకూలింది. దీంతో ప్రాణ నష్టం తప్పింది. కూలిన ఇంటిని గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు, విఆర్ఒ నేదురి.రవికుమార్ సోమవారం పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.


కూలిపోయిన ఇంటి వద్ద బాధితుడు